మొరాయించిన ఆర్టీసీ బస్సు

బస్సు స్టార్ట్ కాకపోవడంతో వెనక్కి నెడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల నుంచి పెద్ద ఉప్పరపల్లి వెళ్లే పుంగనూరు డిపో ఆర్టీసీ బస్సు సర్వీసు ఆదివారం సాయంత్రం మొరాయించింది. పెద్ద ఉప్పరపల్లి నుంచి సోమలకు వచ్చి ఆ తర్వాత సోమల నుంచి పెద్ద ఉప్పరపల్లికి వెళ్లే క్రమంలో సోమల బస్టాండ్‌లో బస్సు ఎంతసేపటికి డ్రైవర్ స్టార్ట్ చేసిన స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికులు గ్రామస్తులు బస్సును వెనక్కి నెట్టి ఎట్టకేలకు స్టార్ట్ చేశారు. ఎట్టకేలకు ప్రయాణికులతో పెద్ద ఉప్పరపల్లికి బస్సు బయలుదేరింది. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో జరగగా పలువురు రాత్రి వేళల్లో నడిచే బస్సులు ఈ విధంగా స్టార్ట్ కాకుండా మొరాయిస్తే ఎలా అని, కండిషన్ కలిగిన బస్సులను డిపో వారు నడపాలని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు.

వార్డు సభ్యుల నిధుల్లో..

ఎంపీడీవో చేతివాటం

- 20 టీ కప్పులకి రూ.1,28,558లు ఖర్చు
- మండల కార్యాలయంలో అవినీతి బాగోతం

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్

ఉప సర్పంచ్, వార్డు సభ్యుల శిక్షణా కార్యక్రమానికి విడుదల చేసిన నిధులలో ఎంపీడీవో అవినీతికి పాల్పడిన సంఘటన విజయపురం మండల కార్యాలయంలో చోటుచేసుకుంది. ఇటీవల ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం జరిగింది. ఇందుకు గాను కేంద్ర రూ.1,28,558లు నిధులు మంజూరు చేసింది. అయితే వార్డు సభ్యులకు నిధులు అందించకుండా అధికారులు అతినీతి పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం.

ఎంపిడిఓ కార్యాలయం

20 మంది వార్డు సభ్యులకు రూ.1,28,558లు

విజయపురం మండలంలో మొత్తం 25 పంచాయతీ, 12 సచివాలయాలు ఉన్నాయి. ఒక పంచాయతీకి ఒక ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులు మొత్తం 75 మందికి రెండు రోజులు శిక్షణ ఇవ్వాలి. అయితే రెండు రోజులు జరిగిన శిక్షణ కార్యాక్రమానికి కేవలం 20మంది మాత్రమే హాజరయ్యారు. హాజరైన వాళ్ళకి ఒక నోట్ బుక్, ఒక పెన్ను ఇవ్వాలి. అవి కూడా ఇవ్వకపోవడం గమనార్హం. వీరికి రెండు బిస్కెట్, ఒక టీ అందించినందుకు రూ.1,28,558 డ్రా చేశారు. 23.10.2024 తేదీన చెక్ నెంబర్ 019120, రూ.54,208లు, 24.10.2024 తేదీన చెక్ నెంబర్ 019121, రూ74,350 డ్రా చేసినట్టు తెలిసింది. మొత్తం శిక్షణా కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు రూ.1,29,536లు కాగా, అందులో రూ.1,28,558లు డ్రా చేసి 978 రూపాయలు అకౌంట్లో ఉంచారు. అంతేకాకుండా మండల కేంద్రంలో అవినీతి బాగోతం జరుగుతోందని, జిల్లా అధికారులు పట్టించుకోవడం వల్లే అవినీతికి అడ్డు ఆదుపులేకుండా ఉన్నాయని మండల ప్రజలు మండపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి దుర్వినియోగం చేసిన సొమ్మును రికవరీ చేయించి ఇలాంటి వారిని కఠినంగా శిక్షించి రెగ్యులర్ ఎంపీడీవోను వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



SBI
STATEMENT OF ACCOUNT

STATE BANK OF INDIA
PANNUR
PANNUR, VIJAYAPURAM MANDAL
DIST:CHITTOOR ANDHRA PRADESH
Pin Code : 517586

MPDO VIJAYAPURAM BRGF A/C2-12012-13 MP MPDO
VIJAYAPURAM BRG
VIJAYAPURAM

VIJAYAPURAM
Chittoor
Pin Code 517586

Branch Code
Branch Email
Branch Phone

Date of Statement : 24-10-2024
Time of Statement : 15:45:37
Cleared Balance : 6,765.00CR
Uncleared Amount : 0.00
+MOD Bal : 0.00
Limit : 0.00
Monthly Avg Balance : 0.00
Interest Rate : 2.70 % p.a.
Drawing Power : 0.00
Account Open Date : 05-02-2013

CIF No : 86604162683
Account No : 32808777867
Product : REGULAR SB CHQ-ENTITIES
IFSC Code : SBIN0005811
MICR Code : 517002584
Currency : INR
Account Status : OPEN
Nominee Name :
Email : Not Available

Statement From : 24-09-2024 To 24-10-2024

Post Date	Value Date	Description	Cheque No/Reference	Debit	Credit	Balance
		BROUGHT FORWARD				5,787.00CR
25-09-2024	25-09-2024	INTEREST CREDIT			978.00	6,765.00CR
11-10-2024	11-10-2024	DEP TFR NEFT*UBIN0566420*0016685204 85*BILLS PAYABLE - OTH 0097236044308 AT 05811 PANNUR			74,350.00	81,115.00CR
18-10-2024	18-10-2024	DEP TFR NEFT*UBIN0566420*0016800200 18*BILLS PAYABLE - OTH 0099677044304 AT 05811 PANNUR			54,208.00	1,35,323.00CR
23-10-2024	23-10-2024	CAS CASH CHEQUE CASH WITHDRAWAL BY CHQ	029120	54,208.00		81,115.00CR
24-10-2024	24-10-2024	CAS CASH CHEQUE CASH WITHDRAWAL BY CHQ	029121	74,350.00		6,765.00CR
		CLOSING BALANCE				6,765.00CR

మండలంలో అవినీతి అధికారులే..

కొన్ని సంవత్సరాల ముందు ఇలాంటి సంఘటన జరిగింది. ఇటీవల ఓ ఎంపీడీవో మండల గ్రాంట్ నుంచి నిధులను స్వాహా చేసిన విషయం కూడా ఉన్నతాధికారులకు తెలిసిందే. అయితే అదే తరహాలో మళ్లీ అవినీతి బాగోతం జరుగుతున్నా జిల్లా అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై మండల ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైన జిల్లా యంత్రాగం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విచారణ చేస్తాం..

- రవి నాయుడు, జెడ్‌పి సీఈఓ, చిత్తూరు.

వార్డు సభ్యుల నిధులకు దుర్వినియోగం చేస్తే కోఆర్డినేటర్ చూసుకుంటారు. అలాంటివి ఏమైనా జరిగి ఉంటే నా దృష్టికి తీసుకువస్తారు. దుర్వినియోగం చేసి ఉంటే రికవరీ చేయిస్తాం..

ఎవరిని వదిలిపెట్టం..

- షణ్ముగం, చిత్తూరు కోఆర్డినేటర్

కేంద్ర నిధులను దుర్వినియోగం చేస్తే ఎవరిని వదిలిపెట్టం. వారి మీద విచారణ చేపట్టి అలాంటి ఏమైనా జరిగి ఉంటే చర్యలు తీసుకోవడంతోపాటు రికవరీ కూడా చేయిస్తాం. అంతేకాకుండా జెడ్‌పి సీఈవో, కలెక్టర్‌కి కూడా తెలియపరచి వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

నిధులు రాలేదు..

- రమణ ప్రకాష్, ఎంపిడిఓ, విజయపురం

కేంద్రం నుంచి నిధులు ఏమైనా వచ్చాయా సార్ అని ఎంపీడీవో రమణ ప్రకాష్‌ను వివరణ కోరగా వార్డు నెంబర్లు, ఉపసర్పంచ్ల శిక్షణ కార్యక్రమానికి వచ్చే నిధులు ఇంకా రాలేదని, తాను ఇంకా చూడలేదని, తనకేమీ తెలియదని ఆయన చెప్పాడు. ఒక్కసారి జిల్లా అధికారులకి ఫోన్ చేసి కనుక్కొని మీకు వివరణ ఇస్తానని ఆయన తెలిపారు.

విద్యారంగ పరిరక్షణకు సుదీర్ఘ పోరాటం

ఘనంగా యుటిఎఫ్ 17వ మహాసభలు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి- పూతలపట్టు

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా చిత్తూరు జిల్లా 17వ మహాసభలు మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నక్క వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, బాబురెడ్డి, జీవీ రమణ నేతృత్వంలో పూతలపట్టు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ర్యాలీ అనంతరం నిర్వహించిన సమావేశంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం సుదీర్ఘ పోరాటం చేస్తున్న యుటిఎఫ్‌ను అభినందించారు. అభ్యుదయ భావాలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా యుటిఎఫ్ ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, అలాగే ప్రభుత్వరంగ విద్యావ్యవస్థను బలోపేతం చేయనున్నట్టు తెలిపారు. సిపిఎస్ రద్దు విషయంలో కూడా ప్రభుత్వం ప్రణాళికల సిద్ధం చేసిందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ గురువులు ఆదర్శప్రాయంగా నిలవాలన్నారు. మండల స్థాయి యుటిఎఫ్ ఇంత పెద్దస్థాయిలో సమావేశం ఏర్పాటు చేయడం హర్షదాయకమన్నారు. ప్రభుత్వ రంగ విద్యావ్యవస్థను కాపాడుకోవడంతో యుటిఎఫ్ ఎల్లప్పుడూ ముందుండి పోరాటం చేస్తుందన్నారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కొరకు నిత్యం పోరాటం చేస్తుందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు బాబురెడ్డి, దేవరాజులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రెడ్డప్ప నాయుడు, సోమశేఖర్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

యుటిఎఫ్ ర్యాలీ

వ్యాస రచన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

- యశస్వినికి మూడో బహుమతి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు

పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కాలేపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని యశస్వినికి థర్డ్ ప్రైజ్ లభించింది. మండలంలోని ఒగ్గువారిపల్లి దళితవాడకి చెందిన కానిస్టేబుల్ దేవేంద్రం కుమార్తె యశస్విని కాలేపల్లి హైస్కూల్లో పదో తరగతి చదువుతోంది. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా చిత్తూరులో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థిని యశస్వినికి థర్డ్ ప్రైజ్ లభించింది. దీంతో యశస్వినిని ఎస్పీ మణికంఠ చందోలు అభినందించి, అనంతరం ప్రోత్సాహక నగదు రూ.3వేలను అందజేశారు. అదేవిధంగా యశస్విని కాలేపల్లి హైస్కూల్ హెచ్‌ఎం కేశవరెడ్డితో పాటు టీచర్లు అభినందించారు.

ఏనుగుల్ని భయపెట్టొద్దు..

పంటపోలాలపైకొస్తే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వాలి
భరణి, జిల్లా అటవీశాఖ అధికారి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఒంటరి ఏనుగుల విషయంతో అత్యంత జాగ్రత్తగా ఉండాలని జిల్లా అటవీశాఖ అధికారి భరణి తెలిపారు. ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ పంటపొలాలపై ఏనుగులు వచ్చే సందర్భాల్లో వాటిని భయపెట్టే ప్రయత్నం చేయవద్దు..అని, ఏనుగులు బెదిరిపోయి మనుషులపై దాడులు చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఏనుగులు వస్తున్నాయని గుర్తిస్తే వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే గ్రామస్తులను కూడగట్టుకొని పెద్దశబ్దాలు చేయడం, టపాకాయలు కాల్చివాటి మీద వేయడం వంటి పనులు చేయవద్దు అని సూచించారు. పంట పొలాలపై ఏనుగులు తరచూ దాడులు చేస్తున్నాయని, గత ఎండా కాలంలో తాగునీటి కోసం అడువుల సమీప గ్రామాల్లోకి వచ్చేవని, అయితే ప్రస్తుతం వర్షాకాలంలోనూ వస్తూనే ఉన్నాయన్నారు. జిల్లాలోని కల్లూరు ప్రాంతాల్లో ఒంటరి ఏనుగు దాడిలో రైతు చనిపోయారని, మూడు రోజులు పాటు శ్రమించి అడవిలోకి తరిమేయడం జరిగిందన్నారు. కర్నాటక, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగుల దాడులు ఎక్కువగా ఉంటాయని, అటవీ సమీప ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజాశక్తి : ఏనుగుల దాడిలో ఎంత మంది మృతువాత పడ్డారు.

డిఎఫ్ఒ: గత ఐదేళ్ళలో ఏనుగుల దాడిలో 20 మంది వరకు మృతువాత పడ్డారు. తాజాగా కల్లూరు ప్రాంతంలో ఒకరు మృతువాత పడ్డారు. కుప్పం, వికోట, శాంతిపురం, గుడిపాల వంటి ప్రాంతాల్లో ఏనుగుల దాడులు ఎక్కువగా ఉంటున్నాయి.

ప్రజాశక్తి: మదపుటేనుగుల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డిఎఫ్ఒ: పలమనేరు, కుప్పం, చిత్తూరు అటవీ శాఖ పరిధిలోని కౌండిన్య అభయారణ్యంలో సంచరించే ఏనుగులతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కౌండియ్య అటవీ ప్రాంతంలోకి వచ్చే మదపుటేనుగులు ఎక్కువగా వస్తుంటాయి. ఇలాంటి మదపుటేనుగులు పంట పొలాలపై దాడులు చేసే సందర్భాల్లో గ్రామస్తులు జాగ్రత్తగా ఉంటూ వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలి. వీటిని బెదిరించే ప్రయత్నం చేస్తే ప్రజలపైదాడులకు పాల్పడతాయి.

ప్రజాశక్తి : ఏనుగుల దాడుల నివారణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎఫ్ఒ: ఏనుగుల దాడుల నుండీ పంటనష్టం, ప్రాణ నష్టం చోటు చేసుకోకుండా ఇతర ప్రాంతాల నుండీ వచ్చే ఏనుగులను కట్టడి చేసేందుకు కుంకీ ఏనుగులను రంగంలోకి దింపడం జరుగుతుంది. మన వద్ద ఉన్న కుంకీ ఏనుగుతో పాటు కర్నాటక అటవీశాఖ సహకారంతో మరో నాలుగు ఏనుగులు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం. అటవీ ప్రాంత సమీప గ్రామాల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు, అడవుల చుట్టూ కందకాల త్వకాలు చేపటడంతో పాటు ఏనుగుల సంచరించే ప్రాంతాలను గుర్తించేందుకు సీసీ కెమరాలు ఏర్పాటు చేయడం జరుగుతోంది. ఏనుగులను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తున్నాం.

ప్రజాశక్తి: ఏనుగుల దాడి నుండీ తప్పించుకోవాలంటే ఏం చేయాలి?

డిఎఫ్ఒ: ఒంటరి మదపుటేనుగులు ఆగ్రహంగా ఉన్న సమయంలో వాటి కంటికి కనిపించినప్పుడు తరుముతూ దాడి చేసే ప్రయత్నం చేస్తాయి. ఆ సమయంలో నేరుగా కాకుండా ఎస్ ఆకారంలో పరుగుతీయాలి. అప్పటికీ ఏనుగు వెంబడిస్తే ఒంటిపై ఉన్న బట్టలను తీసి కింద పడేయాలి. దాన్ని ఏనుగు తొక్కుతున్న సమయంలో అక్కడి నుంచి దూరంగా పారిపోయే ప్రయత్నం చేయాలి.

కాశిరాళ్ల ప్రభుత్వ పాఠశాలకు....

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారం...

- రూ.50లక్షలతో అభివృద్ధి పనులు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో యాదమరి మండలంలోని కాశిరాళ్ల కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌లో రూ.50లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చేయూతనందించిందని కళాశాల ప్రిన్సిపాల్ లలిత తెలిపారు.

ప్రజాశక్తి- యాదమరి

ప్రిన్సిపాల్ లలిత

సుమారు రూ.50లక్షల రూపాయల వ్యయంతో పాఠశాల ఆవరణంలో ఫుడ్ అండ్ న్యూట్రిషియన్ కింద వంట గది, డైనింగ్ హాల్, బాలికలకు మరుగుదొడ్లు, వాలీ బాల్ కోర్టు, షటిల్ కోర్టు నిర్మించారు. డైనింగ్ హాల్‌లో ఒకేసారి 300 మంది విద్యార్థులు భోజనాలు చేసేలా ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో నిర్మించిన భోజనశాల

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నిర్మించిన వంటగది

గతంలోనూ స్వచ్ఛత పక్వాడలో భాగంగా సుమారు 15 చెత్త బుట్టలు, పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా జామ, కొబ్బరి, టేకు, మామిడి వంటి పదిరకాల మొక్కలను కూడా ఐఓసిఎల్ పాఠశాలకు అందించారు. అలాగే పాఠశాలలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు, ఆటల పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు ఐఓసిఎల్ అధికారులు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందిస్తూ ప్రోత్సహించేవారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వబడులలోని విద్యార్థులు ఎంతో చక్కగా మంచి నైపుణ్యాలతో, క్రమశిక్షణ కలిగి ఉన్నారని వారు ప్రశంసించారు. అనతికాలంలోనే మహిళ ప్రధానోపాధ్యారాయులుగా ఎపి.లలిత పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించారని తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు ప్రశంసించారు. పాఠశాల ఆవరణంలో ప్రిన్సిపల్ లలిత సహకారంతో రూ.1.5లక్షల వ్యయంతో సరస్వతిదేవి మందిరం నిర్మించడానికి కృషి చేశారు. అలాగే ఉపాధ్యాయులు సహకారంతో రూ.70వేలతో విద్యార్థుల కోసం నీటి బోర్‌మోటర్ తెప్పించారు. ఈ పాఠశాల ప్రాంగణం పచ్చని చెట్లు, నిత్యం మంచి చల్లని గాలి, పరిశుభ్రతతో పాఠశాల చూడ ముచ్చట గొలుపుతూ ఉంటుంది. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయ బృందం మంచి బోధనా అనుభవం కలిగిన సీనియర్ ఉపాధ్యాయులే ఉన్నారు. పాఠశాల సుమారుగా 430 విద్యార్థులతో కళకళ లాడుతుంటుంది. ఐఓసిఎల్ డిజిఎ అమితాబ్ సర్దార్, అధికారులు కైలాష్ కాంత్, అరుణ్ ప్రసాద్ పాఠశాల అభివృద్ధికి నిత్యం సహకరిస్తు ఉంటారు. జిల్లాలోనే ఈపాఠశాలకు ప్రత్యేకస్థానం కలిగి ఉన్నది అనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నిర్మించిన నూతన భవనాలను త్వరలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ అమితాబ్ సర్దార్

రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం

జల హారతి ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ థామస్

ప్రజాశక్తి- కార్వేటినగరం: కృష్ణాపురం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నీరు నిండి నిండు కుండాల కళకళాడుతోందని, ప్రాజెక్టుకు నీరు రావడంతో జిడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ ఆదివారం పూజల చేసి జలహారతి పట్టారు. అనంతరం కృష్ణాపురం డ్యాంలోని మూడు గేట్లను పరిశీలించి ఇరిగేషన్ అధికారులు ఏఈ రవి ప్రకాష్‌ను నీటిసామర్థ్యం, డ్యాంకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. డ్యాం కుడి, ఎడమ కాలువలు మరమ్మతులకు గురైనట్లు ఎమ్మెల్యేకు వివరించారు. డ్యాం పరిధిలోని అసంపూర్తిగా ఉన్న కాలువలను మరమ్మతులు చేపట్టడానికి కృషి చేస్తానన్నారు. కృష్ణాపురం డ్యాం గేట్లు ద్వారా వదిలిన నీళ్లను చెరువులకు నింపి వాటి ద్వారా పుష్కలంగా రైతుల పంటలు పండించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్యాంలో నిల్వ సామర్థ్యాన్ని పెంచితే రైతులకు మరింత సౌకర్యంగా ఉంటుందని మండల పార్టీ అధ్యక్షులు చెంగలరాయల యాదవ్, జిల్లా, తెలుగు యువత కార్యదర్శి బిగల రమేష్ చెప్పడంతో జిల్లా కలెక్టర్‌తో చర్చించి పనులు చేసేలా చూస్తామని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నాగేశ్వరరాజు, ఎంపీడీవో చంద్రమౌళి, ఏఈలు ప్రకాష్, రాజుల్ భాస్కర్, వెంకటేష్, సుబ్రహ్మణ్యం రెడ్డి, వేలయుధం, గిరీష్ రెడ్డి, టిడిపి నాయకులు గుండయ్య, రాజేంద్రరెడ్డి, గణేష్ రాజు, ప్రకాష్, రామచంద్ర రాజు, అయ్యప్ప మందడి, సోమశేఖర్ యాదవ్, అన్నారెడ్డి రమేష్ రెడ్డి, చంద్రమౌళి రెడ్డి, రవిరాజు, హేమంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఆటోలు.. అటు..ఇటు..

- ప్రజలకు, వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు
- నిబంధనలు పాటించని డ్రైవర్లు
- ప్రమాదాలకు సూచనలు

శరవేగంగా మారుతున్న సమాజంలో.. ప్రజలు అంతే వేగంగా పరుగులు తీస్తున్నారు. తమ అవసరాలమేరా.. బస్సుల కంటే ఆటోల మీదనే అధికంగా ఆధారపడుతున్నారు. ఇదే రీతిలో నిబంధనలు పాటించని ఆటోల వల్ల అధికంగా ప్రమాదాల భారినపడుతున్నారు. వాహనాల స్థితిగతులను పరిగణలోకి తీసుకోవలసిన అధికారులు సైతం చూసి చూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఆటోల తీరు ఇష్టానుసారంగా మారింది.

ప్రజాశక్తి- పూతలపట్టు

అంబేద్కర్ సర్కిల్ వద్ద రోడ్డుకు ఇరువైపులా అడ్డదిడ్డంగా ఉన్న ఆటోలు , జడ్పీ ఉన్నత పాఠశాల ముందు ఆటోలు

పూతలపట్టు మండల పరిధిలోని జాతీయ రహదారికి ఇరువైపులా సుమారు 26 గ్రామాలు ఉన్నాయి. మిగిలిన 227 గ్రామాలు మండల కేంద్రానికి రెండు నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న మండలం కావడంతో గ్రామీణ ప్రజలు అధికంగా రాకపోకలు సాగిస్తుంటారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా 336 ఆటోలు ఉన్నాయి. చాలా కుటుంబాలు ఆటోల మీద ఆధారపడి జీవిస్తున్నాయి. కొందరు క్రమశిక్షణతో నిబంధనలు పాటిస్తున్నారు. మరికొందరి తీరుతో సమస్యలు ఎదురవుతున్నాయి. పలువురు నిబంధనలు పాటించడం లేదు. కాకి చొక్కా ధరించాల్సిన ఉండగా చాలామంది వేసుకోవడం లేదు. అతివేగంగా వాహనాలు నడుపుతుండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు దృష్టి సారించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ఎక్కడపడితే అక్కడ ఆపేస్తూ...

ఆటోలను ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా ఆపుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారిపై ఇష్టానుసారంగా వాహనాలు ఆపుతునడంతో తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. తలుపులపల్లి, బండపల్లి, పూతలపట్టు అంబేద్కర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో సమస్యలు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించకపోవడంతో నిబంధనను అమలు కావడం లేదు.

పట్టించుకునే వారే కరువు..

మండలంలో చాలామంది ఆటోడ్రైవర్లు కనీసం ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించడం లేదు. ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలని చెప్పేవారే కరువయ్యారు. పోలీసులు జారీ చేసే టాప్ నెంబర్లు కాదు కదా కనీసం రిజిస్ట్రేషన్ నెంబర్లు కూడా రాయించుకోవడం లేదు. పలువురి వద్ద డ్రైవింగ్ లైసెన్సులు అర్హ పత్రాలు సైతం ఉండడం లేదు. అంతేకాకుండా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతోపాటు వాహనాలను అతివేగంతో నడుపుతున్నారు.

కట్టుదిట్టమైన చర్యలేవి..

ఆటోలు తీరుపై కట్టుదిట్టమైన చర్యలు కనిపించడం లేదు. కొందరు వ్యక్తులు ఆటోలకు సంబంధించి టాప్ నెంబర్లు పొందకుండా రిజిస్ట్రేషన్ నెంబర్ రాయించుకోవడం లేదు. ఈ ముసుగులో ఒకరిద్దరూ నేరాలకు పాల్పడుతున్నట్టు సమాచారం. పోలీసులు సైతం టాప్ నెంబర్ విషయంలో కట్టుదిట్టంగా వ్యవహరించడం లేదు. నేరాలకు పాల్పడుతున్న పలువురు గురించి పోలీసులకు తెలిసిన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు దృష్టి సారించి ఈ వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఉంది.

పిల్లలను సన్మార్గంలో నడిపించాలి

- పాస్టర్ రాకేష్ పిలుపు

ప్రజాశక్తి-పుంగనూరు: తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్నప్పటి నుంచి సన్మార్గంలో నడిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పాస్టర్ రాకేష్ నిమ్రోద్ తెలిపారు. స్థానిక సిఎస్ఐ హెచ్ఎం చర్చిలో ఆదివారం ప్రపంచ చిన్నారుల దినోత్సవం ఘనంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ మాట్లాడుతూ సమాజంలో పిల్లలు సెల్ ఫోన్లు, యూట్యూబ్‌లకు బానిసలై కుటుంబ వ్యవస్థ చిన్నా భిన్నం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు చిన్నప్పటి నుంచి మంచి నడవడికలు నేర్పిస్తే సమాజం బాగుంటుందని అన్నారు. కుటుంబం, బంధువులు, స్నేహితులు, ఆటపాటలు ఎక్కువ సమయం గడపాలన్నారు. చర్చిలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బైబిల్ పట్టించి, ఏసుక్రీస్తు పిల్లల పట్ల కలిగిన ప్రేమానురాగాలు గురించి నిత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో టీచర్లు ఎస్తేరు రాణి, తనులత, హేంద్రీ హేమంత్, చర్చి కార్యదర్శి రవికుమార్, మాజీ కార్యదర్శి భరత్ భూషణ్, కోశాధికారి సురేష్, క్రిస్టఫర్ సభ్యులు దేవ ప్రకాష్, చిట్టి, రాజకుమారి, సువర్ణ, సుకన్య, హేమలత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- డీఎస్పీ ప్రభాకర్

మొగిలి ఘాట్ రోడ్డును పరిశీలిస్తున్న డీఎస్పీ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని మొగిలి ఘాట్లో విలేకరులతో మాట్లాడారు. గత రెండు నెలలకు మునుపు జరిగిన భారీ ప్రమాదంలో ప్రాణ నష్టం అధికంగా అయిందని అప్పటి నుంచి ప్రమాదాల నివారణ కోసం సూచిక బోర్డులు వేగ నియంత్రణలో అతివేగంగా వచ్చే వాహనాలను వేగం తగ్గించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. కానీ వాహనదారులకు వాటిని లెక్కచేయక ప్రమాదాలకు గురవుతున్నారని పది నిమిషాలు ఆలస్యమైనా క్షేమంగా ఇంటికి చేరేందుకు చూడాలన్నారు. ఇంటివద్ద భార్య పిల్లలు తమరి కోసం ఎదురు చూస్తూ ఉంటారని ఇది గుర్తించుకునే వాహనాలు నడిపి వేగ నియంత్రణతోనే ప్రమాదాల నివారించవచ్చు అన్నారు. కార్యక్రమంలో సిఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ కిరణ్, కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

ఎండ.. ఎముకలకు అండ

- రోజూ సూర్యుడితో కొంత సేపు గడపండి
- ఏసీ గదులకే పరిమితమయితే ప్రమాదమే
- పెరుగుతున్న ఆస్టియోపారోసిస్ బాధితులు
- పిల్లల్లోనూ కనిపిస్తున్న వ్యాధి లక్షణాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వైద్య నిపుణులు
- చిన్న దెబ్బలకే ఎముకలు ఫట్



ప్రజాశక్తి-కార్వేటినగరం: ఉదయం నిద్ర లేచింది మొదలు చీకటి పడే వరకు అసలు సూర్యుడిని ఏ మాత్రం చూడకుండా, సూర్యరశ్మిని శరీరానికి తాకనీయకుండా ఉంటే ఆస్టియో పారాసిస్స్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొద్దిపాటి దెబ్బలకే ఎముకలు విరిగిపోవడాన్ని గుర్తించామని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు. సూరుడి లేత కిరణాలు కొంత సేపు శరీరంపై ప్రసరించడం ద్వారా ప్రకృతి సిద్ధంగా సూర్యుడి నుంచి విటమిన్ డి లభిస్తుంది. చాలా మంది భానుడి ముఖం చూడకుండానే కాలం గడిపేస్తూ ఉండటం, గదుల్లో ఉంటూ ఉద్యోగాలు నిర్వహించడం వల్ల డి విటమిన్ సమస్యల బారిన పడుతున్నట్లు వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఎముకలు విరిగి పెరిగిన మరణాలు

చిన్న దెబ్బలకే ఎముకలు విరిగి పోవడం స్టియోపారోసిస్ వ్యాధి సోకిన వారిలో కనిపించే ప్రధాన లక్షణం. వయస్సుమీద పడే కొద్దీ అనేక వ్యాధులు సోకి బాధిస్తాయి. వాటిల్లో ఆస్టియోపారోసిస్ ఒకటి. ఆడవాళ్లలో మెనోపాజ్ దస దాటిన తరువాత 40ఏళ్లలో, మగవాళ్లలో 50ఏళ్ల వయస్సులో ఈ వ్యాధి వస్తుంది. అయితే ఆధునిక జీవనశైలి వల్ల నేడు 35ఎళ్లకే ఆడవారు, 45ఏళ్లకే మగవారు ఈ వ్యాధి బారిన పడటంపై వైద్యనిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సూత్యరశ్మి ఏమాత్రం సోకకుండా ఏసీ గదుల్లో అధిక సమయం గడిపేవారు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా వయో వృద్ధుల్లో 33శాతం మంది తుంటి ఎముక విరిగి బాధపడుతుండగా వారిలో ప్రతి ఐదుగురిలో ఒకరు మరణిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు

వయస్సు పైబడిన వారిలో ఒళ్లంతా నొప్పులు, ఏ పని చేయలేక పోవడం, నీరసం, నిస్సత్తువ, నిరాశ, ఓపిక లేకపోవడం తదితర లక్షణాలు ప్రాథమిక దశలో కనిపిస్తాయి. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే అశ్రద్ధ చేయకుండా ఆర్థోపెడిక్ వైద్యుడిని సంప్రదించాలి. అశ్రద్ధ చేస్తే వెన్నుపూస, చేతిమణికట్టుం తుంటి వద్ద ఏ మాత్రం చిన్నదెబ్బ తగిలినా చివరకు ఇంటి గడప కాలికి తగిలినా ఎముకలు విరిగిపోతాయి. శారీరక వ్యాయామం ఏ మాత్రం చేయనివారికి ముఖ్యంగా ప్రతి రోజూ కనీసం అఎగంట కూడా నడవక పోవడం వల్ల ఇది సోకుతుంది. వ్యాధి తీవ్రత పెరిగినప్పుడు మాత్రమే ఎక్సరే ద్వారా తెలుస్తుంది. ఎముకల సాంద్రత పరీక్ష చేయించడం ద్వారా వ్యాధి సోకే అవకాశం ఉందా లేదా సోకిందా ? అనేవిషయాలు తెలుస్తోంది.

బాధితులు అధికమే..

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం మెనోపాజ్ తరువాత ముగ్గురు మహిళల్లో ఒకరు వ్యాధి బారిన పడుతున్నారు. వయస్సుపై బడిన పురుషుల్లోనూ బాధితులు అధికంగా ఉన్నారు. కార్వేటినగరం సీహెచ్‌సీల రోజుకు 20 నుంచి 40మంది ఓపీకి వివిధ రకాల ఆర్థోపెడిక్ సమస్యలతో వస్తున్నారు. వీరిలో నగం మంది ఆస్టియోపారోసిస్ బాధితులే. ఉమ్మడి జిల్లాలో సుమారు 50మంది ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు ఉన్నారు. వీరి వద్దకు ప్రతి రోజూ 5 నుంచి 10మంది చికిత్స కోసం వస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

వ్యాధికి చికిత్సలో భాగంగా శరీరంలో క్యాల్షియం లెవల్స్ పెంచాలి. వయస్సు మళ్లిన వారికి విటమిన్ డి. క్యాల్షియం మాతరలు ఇవ్వాలి. రోగులను ఖాళీగా ఉంచకుండా వారికి ఏదోఒక వ్యాపకం కల్పించాలి. పోషకాహారాన్ని అందించాలి. పొగ, మద్యం తాగడం లాంటి చెడు అలవాట్లు, విడనాడాలి. కీళ్లవాతం, కిడ్నీ వ్యాధులు, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారికి ఆస్టియోపారోసిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. కాబట్టి వీరికి ముందస్తు పరీక్షలు చేయించాలి.

డాక్టర్ గోపినాథ్, జనరల్ పిజిషన్, సీహెచ్‌సీ వైద్యాధికారి, కార్వేటినగరం

సీహెచ్‌సీలో ఉచిత వైద్య సేవలు

కార్వేటినగరం సీహెచ్సీ ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో ఆస్టియోపారాసిస్ బాధితులకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నాం. బాదితుల్లో మహిళలే అధికంగా ఉంటున్నారు. వారు ఎక్కువగా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల సమయంలో కనీసం 20 నుంచి 30 నిమషాల పాటు లేత సూర్యకిరణాలు శరీరంపై పడేలా కూర్చోవటం చాలా మంచిది.

డాక్టర్ శృతి భాగ్యం, సీహెచ్ఎస్, కార్వేటినగరం

క్రైం కార్నర్

కారును ఢీకొన్న బైక్

- ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-గుడిపాల: ఆగి ఉన్న కారును బైక్ ఢీకొన్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. చిత్తూరు నుంచి వేలూరుకు వెళ్తున్న కారు ఓరియన్ ఫ్యాక్టరీ రోడ్డు వద్ద ఆగి ఉంది. అదే దారిలో వెళ్తున్న ద్విచక్ర వాహనం ఆ కారును ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారులు ప్రకాష్, కిరణ్ కుమార్‌లకు గాయాలయ్యాయి. కారు అద్దాలు ధ్వంసం అయ్యాయి. 108సిబ్బంది శివ, బాబిలు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి-పూతలపట్టు: ఇంట్లో పని చేసుకుంటున్న మహిళను బెదిరించి చైను లాక్కెళ్లిన ఘటన ఆదివారం మండలంలోని తిమ్మిరెడ్డిపల్లె జగనన్న కాలనీలో చోటు చేసుకుంది. తిమ్మిరెడ్డిపల్లికి చెందిన భారతి ఆదివారం ఉదయం 9-10 గంటల సమయంలో ఇంటిదగ్గర పనులు చేసుకునే సమయంలో దొంగలు ద్విచక్ర వాహనంపై వచ్చారు. పక్కన ఆపి భారతి ఇంటికి వెళ్లిచేతులు వెనక్కు పట్టుకుని అరిస్తే చంపేస్తామని బెదిరించారు. వెంటనే మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లి బైక్‌పై కడప వైపు వెళ్లారని బాధితురాలు తెలిపింది. బంగారు విలువ సుమారు రెండు లక్షలు ఉంటుందని, యువకులు మాస్కులు వేసుకొని ఉన్నట్టు బాధితురాలు స్థానిక పోలీసులకు వివరించింది. గత నెల 26న కూడా జాతీయ రహదారి తేనెపల్లి చెరువు వద్ద చైన్ స్నాచింగ్ జరిగిన ప్రమాదంలో ఐరాల మండలం పుల్లూరుకు చెందిన ఒక మహిళ గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే.

సారా ఊట ధ్వంసం

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని అక్రమంగా నిర్వహించిన నాటుసారా స్థావరాల పై ఎస్ఐ రాజకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మెరుపు దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రహస్య సమాచారంతో దాడులు నిర్వహించి నాటుసారా ఊటను ధ్వంసం చేశామన్నారు. గోపిశెట్టిపల్లి, కనికాపురం గ్రామ పరిధిలోని చెరుకు తోట్టలో దాడులు చేపట్టామన్నారు. నాటుసారా తయారీకి వినియోగించే పరికరాలను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా నాటుసారా తయారు చేసిన, విక్రయించిన వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుడిపాల: మండలంలోని రాసనపల్లి అటవీ ప్రాంతంలో వెయ్యి లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆదివారం అక్రమ నాటు సారా, కర్ణాటక మద్యం, గంజాయి తదితర అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు దాడులు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా రాసన పల్లి అటవీ ప్రాంతంలో తన సిబ్బందితో తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులకు చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బ్రేక్ ఫెయిల్.. లారీ బోల్తా

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: బ్రేక్ ఫెయిల్ అయి లారీ బోల్తా పడిన సంఘటన ఆదివారం మండలంలోని మొగిలి ఘాట్‌లో చోటు చేసుకుంది. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు బెంగళూరు నుంచి చిత్తూరుకు వస్తున్న లారీ మొగిలి ఘాట్లో బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో అదుపు తప్పింది. లారీ డ్రైవర్ వాహనాన్ని జాతీయ రహదారి పక్కకు తిప్పడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్ క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అధిక మొత్తంలో మద్యం కలిగిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండలంలోని రాగిమానుపెంట గ్రామానికి చెందిన ఢిల్లీ ప్రసాద్ ఆంధ్ర గోల్డ్ విస్కీ 47 బాటిళ్లు, 180ఎంఎల్ బాటిల్ కలిగి ఉండడంపై అతనిని అదుపులో తీసుకున్నట్లు చెప్పారు. విచారించగా గ్రామంలో విక్రయించేందుకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించినట్లు నేరం అంగీకరించినట్లు వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు ఆయన తెలిపారు.

పంటలపై అడవి పందులు స్వైరవిహారం

- ధ్వంసం అవుతున్న పొలాలు
- తీవ్రంగా నష్టపోతున్నామంటున్న రైతులు

అడవి పందుల దాడిలో వాలిపోయిన వరి పైరు

ప్రజాశక్తి-సోమల: మండలంలో రైతులు పండిస్తున్న పలు పంటలపై అడవి పందులు దాడి చేసి పంటలకు నష్టం కలుగజేసి రైతులకు తీవ్రంగా నష్టం కలగజేస్తున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీ సమీప ప్రాంతాల్లోని పంట పొలాలపై మండలంలో అనేక ప్రాంతాలలో నిత్యం ఏనుగులు దాడులు చేస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. అయితే గ్రామ శివారుల్లో ప్రధాన రహదారుల పక్కనే ఉన్న పంట పొలాలపై అడవి పందులు అడవిలో నుంచి వచ్చి దాడి చేసి నష్టం కలగజేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పంటలు పండిస్తే తీరా పంటలు చేతికొచ్చే సమయానికి అడవి పందులు దాడి చేసి తీవ్రంగా నష్టం కలిగిస్తున్నాయంటున్నారు. దీనివల్ల తాము ఆశించిన మేర పంట దిగుబడి ఉన్నా పందుల దాడి వల్ల తీవ్రంగా నష్టపోయి తాము ఆశించిన విధంగా దిగుబడి రావడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రాత్రి వేళల్లో అడవి పందులు పంటలపై దాడి చేయకుండా ఉండేందుకు శబ్దాలు చేస్తూ రాత్రంతా మేలుకొని పంటలు కాపాడుకుంటూ ఉన్నామని రైతులు చెబుతున్నారు. అయితే ఒక్కోసారి పగలు రాత్రి అని తేడా లేకుండా తాము పొలాల వద్ద లేని సమయం చూసి వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. అడవి పందుల కారణంగా మండలంలో అధిక శాతం వేరుశనగ సాగును కూడా రైతులు నిలిపివేశారు. ఏది ఏమైనా ఎన్నో నష్టాలకు ఓర్చుకొని పంటలు పండించినా చివరకు ధరలు లేక కూడా నష్టాలు చవిచూడాల్సి వస్తుందని ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.

పార్టీలకతీతంగా మండల అభివృద్ధి

- ఎంపీపీ యువరాజ్

ఎంపీపీ యువరాజ్

ప్రజాశక్తి-వి కోట: మండల అభివృద్ధి కోసం పార్టీలక తీతంగా ముందుకు వెళ్తామని ఎంపీపీ యువరాజ్ తెలిపారు. మండల కేంద్రమైన వి కోటలో ఆదివారం పత్రికల వారితో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మండలంలో చోటుచే సుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో రాజకీయ పార్టీలకతీతంగా మండల అభివృద్ధి కోసం, ప్రతి ఒక్కరూ సహకరించి ముందు కెళ్లాలని వారు పిలుపునిచ్చారు. గతంలో చోటు చేసుకున్న పుంగనూరు అల్లర్ల కేసులో వి కోట మండలం నాయకుల ప్రమేయం అంశంలో తనకు సంబంధం లేదని వారు తెలిపారు. అటువంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని వారు విచారం వ్యక్తం చేశారు. తనకు వ్యక్తిగతంగా ఎవరు పైన ఎలాంటి ద్వేషాలు లేవని పార్టీలపరంగా జరిగిన ఆరోపణలు సవాళ్లు ఇకపై పూర్తిగా వదిలి పెట్టి సోదరభావంతో అన్ని పార్టీల వారు కలిసి మండల అభివృద్ధికి కృషి చేసేందుకు సహకరించాలని వారు పిలుపునిచ్చారు.

నిరంతర పారిశుద్ధ్యంతో గ్రామాల్లో పరిశుభ్రత

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని, గ్రామాల్లో నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం వల్ల గ్రామాల్లో పరిశుభ్రత ఏర్పడుతుందని ఎంపీడీవో బాలాజీ అన్నారు. ఆదివారం మండలంలోని మాదనపల్లి పంచాయతీ కత్తార్లపల్లి గ్రామంలో పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు అన్ని పంచాయతీ గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ, ప్రజలకు స్వచ్ఛమైన మంచి నీటిని, వీధి దీపాలను సక్రమంగా వెలిగేటట్లు బాధ్యత తీసుకోవాలని, అలాగే గ్రామాల్లో ప్రజలకు శుభ్రత పాటించే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కంభంపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న దాసర్లపల్లి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ చేపట్టారు. దళితుల ఐక్యతతో గ్రామస్తులు అందరూ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద సోమల ఎస్ఐ శివశంకర్ తన సిబ్బందితో కలిసి ఆదివారం నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికం కావడం, రికార్డులు లేని వాహనాలు రోడ్డుపై తిరుగుతూ ఉండడం కారణంగా తనిఖీలు చేపట్టామన్నారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలకు జరిమానా విధించినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేదరికాన్ని జయించి.. పేదల నాడి పట్టి!

• కష్టంతో ఎదిగారు.. అభివృద్ధిలో పయనిస్తున్నారు.. • ఉపాధి కల్పిస్తున్నారు... ప్రాణాలు పోస్తారు.. • బహుముఖ ప్రజ్ఞాశాలి.. డాక్టర్ ఆర్‌కె రావ్

ప్రజాశక్తి-వి కోట: పేదరికంలో పుట్టి పట్టుదలతో కష్టాలతో అంచెలంచెలుగా ఎదిగి వందల మందికి ఉపాధి కల్పిస్తూ వైద్యులుగా ప్రజలకు ప్రాణాలు పోస్తూ.. బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఎదుగుతున్న మనసున్న మారాజు డాక్టర్ ఆర్‌కె రావ్. నెల్లూరు జిల్లాలోని మారుమూల గ్రామమైన అన్నవరం గ్రామంలో నిరుపేద వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆర్‌కె రావ్ ప్రభుత్వ బడుల్లో ప్రాథమిక విద్యను ప్రారంభించి కుప్పం మెడికల్ కళాశాలలో వైద్య విద్యను అభ్యసించారు. ఎంబిబిఎస్, పిజి పూర్తి చేసిన వెంటనే కుప్పం పిఈఎస్ మెడికల్ కళాశాలలో వైద్యునిగా తన వృత్తిని ప్రారంభించారు. బెంగళూరు నారాయణ హృదయాలయ హాస్పిటల్‌లో సేవలను అందించారు.

ఆర్‌కె హాస్పిటల్ ప్రస్థానం..

మారు మూల ప్రాంతమైన వి కోట పరిసర ప్రాంత పేదలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించాలన్న తలంపుతో ఆర్‌కె హాస్పిటల్‌ను ప్రారంభించారు. తక్కువ కాలంలో గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే ఎంతోమందికి ప్రాణాలు కాపాడి మంచి వైద్యుడిగా పేరు సంపాదించారు. ప్రపంచాన్ని వనికించిన కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో కూడా ఎంతో ధైర్యంతో రోగులలో మనోధైర్యాన్ని కల్పించి, వైద్య సేవలు అందించి ప్రజల నుంచి ప్రశంసలు పొందారు. ఆర్‌కె రావ్ భార్య డాక్టర్ శాలిని కూడా వైద్యురాలు కావడంతో భర్తకు వెన్నుదన్నుగా నిలిచి వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నారు. వైద్య విద్యను అభ్యసించిన ఎంతోమంది నిరుద్యోగులకు తన వైద్యశాలలో ఉద్యోగాలు ఇచ్చి ఉపాధిని కల్పిస్తున్నారు.

పాడి పరిశ్రమలో ఉపాధి కల్పన

వైద్యరంగంలో ఎంతో బిజీగా ఉన్నా కూడా పశుపోషణపై ఉన్న మక్కువతో పాడి పరిశ్రమను ఏర్పాటు చేసి సుమారు 100పశువులను పోషిస్తున్నారు. ప్రజలకు నాణ్యమైన స్వచ్ఛమైన పాలను అందించాలన్న లక్ష్యంతో ప్రతిరోజు దాదాపు 500లీ. పాలు ఉత్పత్తి చేస్తున్నారు. పాడి పరిశ్రమ ద్వారా పదుల సంఖ్యలో నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారు. సుమారు 50కి పైగా లేగ దూడలను పెంచి పశు సంపదను పెంపొందించుకొని, పెట్టుబడులు తగ్గించుకుని సంపదను సృష్టించుకుంటూ ఇతరులకు మార్గదర్శకులుగా నిలుస్తున్నారు.

వ్యవసాయ రంగంపై దృష్టి

వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగిన అనుభవంతో ఆ రంగం వైపు మక్కువతో వ్యవసాయ పొలాలు కొనుగోలు చేసి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకొని ముందుకు సాగుతున్నారు. పశువులకు అవసరమైన పచ్చి గడ్డిని స్వయంగా పెంచుకోవడం ద్వారా కొనుగోలు ఖర్చు తగ్గించుకుంటూ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం రసాయన ఎరువులు వాడకం తగ్గించడం ద్వారా ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో తన వంతు సహాయంగా ముందుకెళ్తున్నారు. పశువుల వ్యర్థాలతో పంటలను పండిస్తూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. పొలం పనులలో పదుల సంఖ్యలో ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

రెస్టారెంట్ వైపు అడుగులు

కష్టపడాలన్న తపనతో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. కుప్పంలో ఆర్‌కె రెస్టారెంట్ ప్రారంభించారు. దీనికి అనుబంధంగా

నివాస సముదాయాలను కూడా నిర్మించి ప్రజలకు సౌకర్యాన్ని కల్పించారు. ప్రస్తుత యువత ఉన్నత చదువులు చదివి ప్రభుత్వం తమకు ఉద్యోగ ఉపాధి కల్పించాలని ఎదురు చూడకుండా, తన చుట్టూ అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని, ఉపాధి అవకాశాలు పెంపొందించుకొని, ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. రాబోవు కాలంలో పేద విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన కార్పొరేట్ విద్యను అందించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్న ఆర్‌కె రావ్ లక్ష్యం నెరవేరాలని ప్రజలు కోరుతున్నారు.

పరస్పర సహకారంతోనే అభివృద్ధి

- ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యేల వ్యాఖ్య

గిరిధర్ నాయుడు ఇంట్లో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-ఐరాల: పార్టీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధుల పరస్పర సహకారంతోనే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా పూర్తవుతాయని ఎమ్మెల్యేలు పులివర్తి నాని, డాక్టర్ కలికిరి మురళిమోహన్ అన్నారు. పూతలపట్టు నియోజకవర్గంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఐరాల మండలం మళ్ళారపల్లె గ్రామంలో ఐరాల మండల టిడిపి అధ్యక్షులు గిరిధర్ బాబు నివాసంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేలు పులివర్తి నాని, డాక్టర్ కలికిరి మురళిమోహన్, గురజాల జగన్మోహన్, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సిఆర్ రాజన్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. 130రోజుల కూటమి ప్రభుత్వం పాలనపై ఆత్మీయ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని, కేంద్ర ప్రభుత్వం సహకారం పూర్తి స్థాయిలో అందుతుందని నేతలు అభిప్రాయ పడ్డారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్న తీరుపై ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, కూటమి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పెరిగిందని కార్యకర్తలు నేతల దృష్టికి తీసుకెళ్ళారు.

'సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేయాలి'



సత్కరిస్తున్న పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి-గంగవరం: సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేయగలిగినప్పుడే అది చిరకాలం కొనసాగుతుందని ప్రముఖ శతావధాని ఆముదాల మురళి అన్నారు. ఆదివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరంలో రామిరెడ్డి గారి మాధవరెడ్డి రచించిన "గండకి' పద్యకావ్యాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగానది ఉపనది అయిన 'గండకి' పూర్వ వృత్తాంతాన్ని తీసుకోని ఒక పద్యకావ్యం వ్రాయడం గొప్ప విషయం అన్నారు. ప్రముఖ ప్రవచన కర్త సమ్మడి జయరామిరెడ్డి మాట్లాడుతూ గండకి అనే వేశ్య, విష్ణు భక్తితో నదిగా మారి విష్ణువును తన గర్భంలో సాలగ్రామంగా పొందిన కథను అద్భుతమైన పద్యకావ్యంగా మలచిన మాధవరెడ్డి అభినందనలు అని అన్నారు. ఈ సందర్భంగా రచయిత దంపతులను తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు పి.తులసినాథం నాయుడు, పుష్పగుచ్చం అందించి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది నాగిరెడ్డి ఆచార్య దండాల రాధాకృష్ణరెడ్డి, రామిరెడ్డి, జొన్న విత్తుల శ్రీరామ చంద్ర మూర్తి, వసంత, తుషార భారతి, మల్లెల నాగరాజు, బాలకృష్ణ, ధనంజయ, విజయ్, సయ్యద్ మొహిద్దిన్, చంద్రశేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుంటే వారు ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఎంఈవో అరుణాచలం రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఆదివారం మండలం కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997-98 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. సుమారు 26సంవత్సరాల క్రితం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ఇలా 26 సంవత్సరాల తరువాత అందరూ పాఠశాలలో కలవడం చాలా గర్వంగా ఉందని వారు తెలిపారు. గతంలో పాఠశాలలో చదువుకునేటప్పుడు విద్యార్థులు వారి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంఈఓ సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు కోదండ, చంద్రశేఖర్, జయచంద్ర, రామచంద్ర, నీలవర్ణం నాయుడు, గోవిందరాజులు, పూర్వ విద్యార్థులు.. సింహాద్రి, తిరుమల, భాగ్యరాజ్, చెంగారెడ్డి, దాము రెడ్డి, ధనలక్ష్మి, చిలకమ్మా, గిరిజ, గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి బయలుదేరిన నాయకులు

ప్రజాశక్తి-గుడిపాల: చిత్తూరు, తిరుపతి జిల్లా (తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు) అధ్యక్షులుగా భూమన కరుణాకర్ రెడ్డి నూతన ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి గుడిపాల వైసీపీ నాయకులు ఆదివారం తిరుపతికి బయలుదేవి వెళ్లారు. ప్రకాష్, రజనీకాంత్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున వెళ్లారు.

'సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి'

సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-పలమనేరు: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం పలమనేరు పట్టణంలో జీయప్ప వీధిలో ఆశాజ్యోతి దివ్యాంగుల సేవా సమితి వార్షికోత్సవం నిర్వహించారు. ధాత్రి ఫౌండేషన్ చైర్మన్ స్వాతి చక్రపాణి, వెలుగు ఓల్డ్ ఏజ్ హోం డైరెక్టర్ భాగ్యలక్ష్మి ముఖ్య అతిథులుగా విచ్చేసి రిబ్బన్ కటింగ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి దివ్యాంగుల ముఖాలలో చిరునవ్వులు చూడాలని అలాగే ఆశాజ్యోతి సంస్థ ఎంతో మందికి సేవ చేయాలని తెలిపారు. అనంతరం మదనపల్లి రోడ్డు లయన్స్ క్లబ్‌లో దివ్యాంగులతో సమావేశం నిర్వహించగా వందలాదిమంది దివ్యాంగులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ, దివ్యాంగుల సమస్యల కొరకు నిరంతరం కృషి చేస్తామని ఐక్యంగా పోరాడాలని ఈ సందర్భంగా ప్రసంగించారు. కార్యక్రమంలో చక్రపాణి, భాగ్యలక్ష్మి, రమణ, కోమల, గోవిందయ్య, మురళి, శివకుమార్, సోమశేఖర్, కాంచన, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి-యాదమరి: పూతలపట్టు నియోజకవర్గం ఉపాధి హామీ పథకం ఏపిఓ, ఏపిడిఓలతో ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ సమీక్ష నిర్వహించారు. శనివారం చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఆయన కార్యాలయంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమావేశమైన ఆయన అభివృద్ధిపై ఆరా తీసారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గోకులం షెడ్లు వాటి నిర్మాణాలకు సంబంధించి పురోగతిపై సమీక్ష చేసిన ఆయన, వీలైనంత త్వరగా పనులు సకాలంలో పూర్తి చేయాలని, మంజూరు చేసిన పనులను ఆలస్యం చేయకుండా లబ్ధిదారులను సంప్రదిస్తూ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో చిత్తూరు క్లస్టర్ ఏపిడి సుబ్రహ్మణ్యం, ఏపీవో బాల, ఉపాధి హామీ ఏపీవోలు పాల్గొన్నారు.

సందర్శన

మండలంలోని ముత్తరపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయస్వామి వారి ఆలయాన్ని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ సందర్శించారు. శనివారం ఆ గ్రామానికి చేరుకున్న ఆయన అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం

- పాల్గొన్న మాజీ మంత్రి రోజా

పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రి రోజా

ప్రజాశక్తి-విజయపురం(నగరి): నగరి రూరల్ మండలం బుగ్గ కండ్రిగలో గ్రామ దేవత మనీషమ్మ నూతన ఆలయ అష్ట బంధన విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక మహోత్సవాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రోజా ఆదివారం పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు వేద పండితులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. మహా కుంభాభిషేకంలో స్వామికి ప్రత్యేక కలశ అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అర్చన, హారతి తీర్థ ప్రసాదాలతో వేద మంత్రాలతో అర్చకులు మాజీ మంత్రిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ ఆర్టీసీ బస్టాండ్ పక్కన గల రిక్రియేషన్ క్లబ్‌లో ఆదివారం చెన్నె శంకర నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 54మంది హాజరైయ్యారు. ఇందులో కంటి శస్త్ర చికిత్స కోసం 34మంది ఎంపికైయ్యారు. వారికి ప్రఖ్యాతి గాంచిన చెన్నె శంకర నేత్రాలయ హాస్పిటల్‌లో బుధవారం బుధవారం కంటి శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుంది. వీరికి ఉచిత ప్రయాణం, భోజనం, వసతి, మందులు అందజేస్తారు. ఆదివారం మధ్యాహ్న భోజనం, తాగునీరు పలమనేరు రిక్రియేషన్ క్లబ్ వారిచే శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారికి, వారి సహాయకులకు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శంకర నేత్రాలయ డాక్టర్ వినోద్, ఆప్తాల మాజిస్ట్ మురళీ క్రిష్ణ, పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి:

మహతి ఫౌండేషన్, బైరెడ్డిపల్లి వారి సహకారంతో పీఈఎస్ ఆసుపత్రి, కుప్పం వారి ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి సమస్యలతో ఉన్నవారు 25మందికి డాక్టర్ హర్షిత్, మనోజ్, సిబ్బంది శ్రీదేవి కంటి పరీక్షలు చేపట్టారు. ఐదు మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వారికి కుప్పం పిఈఎస్ హాస్పిటల్‌కు తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయిస్తారు.

మహతి చైర్మన్ నాగరాజు సహకారంతో శిబిరానికి వచ్చిన మండల ప్రజలకు, డాక్టర్లకు ఉచిత భోజనం సౌకర్యం కల్పించారు. అంతేకాకుండా ఆపరేషన్ చేయించుకునే వారికి రవాణా సౌకర్యాలు కూడా ఉచితంగా సౌకర్యం కల్పిస్తున్నట్లు మారుతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు.

గోవిందయ్య సేవలు మరువలేనివి



గోవిందయ్య దంపతులను సన్మానిస్తున్న పలువురు

ప్రజాశక్తి-కార్వేటినగరం:

గోవిందయ్య గత 33సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో చేసిన సేవలు మరువ లేనివని మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కత్తెరపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే గోవిందయ్య ఉద్యోగ విరమణ సన్మాన సభలో వారు మాట్లాడుతూ ఆ పాఠశాలను ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎదిగారని కొనియాడారు. గోవిందయ్య దగ్గర చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఎదిగారని, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డులు కూడా గోవిందయ్య అందుకోవడం జరిగిందన్నారు. ఎస్‌టియు ఉపాధ్యాయులు వాణి సంపాదికులు గాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే మంచి పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నారన్నారు. ఎస్టియు జిల్లా అధ్యక్షులు కిరణ్ మాట్లాడుతూ మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అంచలంచలుగా ఎదిగారన్నారు. సమాజంలో ఉపాధ్యాయులు అంటే ప్రజలతో మంచి భావన వచ్చేలా మెలిగారని లక్ష్మణరెడ్డి అన్నారు. పలువురు ఉపాధ్యాయులు ఆయన చేసిన సేవలను అభినందించారు.

ఘన సన్మానం

కే గోవిందయ్య రాజ్యమ్మ దంపతులను ఎంఈవో విజయ్ కుమార్ దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు గాజులు నాగేశ్వరరావు, గుర్రప్ప, వేణుగోపాల్, విజయ్ కుమార్ పిళ్ళే, రమేష్, నాగేంద్ర వర్మ, దేవయ్య, గురవయ్య, ఎస్టియూ రాష్ట్ర హృదయ రాజు, సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, చెంగల్రాయల్ మండడి, గురుమూర్తి, పొన్నురంగం, వివిధ మండల ఉపాధ్యాయులు, సంఘం నాయకులు బంధువులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

ప్రయాణికులు నిరీక్షణ

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు నుంచి బెంగళూరు వెళ్లాలంటే ఆది, సోమవారాలలో, పండుగ తర్వాత తిరుపతి నుంచి బెంగళూరు వెళ్లే ఆర్‌టీసీ బస్సులు, కర్ణాటక ఆర్టీసీలు తిరుపతిలో పలమనేరు వారిని ఎక్కించుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరుపతి నుంచి పలమనేరుకు వచ్చే ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే పలమనేరు నుంచి బెంగళూరుకి వెళ్లేటువంటి ప్రయాణికులు వారాంతపు సెలవులు, పండుగలు సందర్భంగా పలమనేరుకు విచ్చేసినటువంటి సాఫ్ట్వేర్ ఉద్యోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి వస్తోంది. చివరకు ప్రతి బస్సులోనూ ఖాళీలు లేక ఏదో ఒక బస్సులో పలమనేరు నుంచి బెంగళూరు వరకు నిల్చుకునే ప్రయాణం చేయవలసి వస్తోంది. ఈ సందర్భంగా అనేకమార్లు ప్రయాణికులు ఆర్టీసీ అధికా రులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన కూడా ఇప్పటివరకు చర్యలు మాత్రం శూన్యం అని మండిపడు తున్నారు. ఈ మధ్య పలమనేరు ఆర్టీసీ డిపోలో ఏడు నూతన సర్వీసులు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ప్రారంబి.చారు. ఆ సందర్భంలో కూడా పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు ఇక్కడి నుంచి బెంగళూరుకి వెళ్లేటువంటి ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రత్యేకంగా పలమనేరు డిపో నుంచి బస్సులు నడపాలని విజ్ఞప్తి చేశారు. అయినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకున్నట్లు కనిపించలేదు. ఇకనైనా అధికారులు తగు చర్యలు తీసుకొని ప్రయాణికులకు బస్సులు ఇబ్బందులు లేకుండా సర్వీసులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి లోకేష్ అమెరికా పర్యటన'

ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ :

ఏపీ బ్రాండ్ తిరిగి సాధించడం, పారిశ్రామికవేత్తల్లో సడలిన నమ్మకాన్ని తిరిగి పెంపొందించడం, ఏపీలో పెట్టుబడులే లక్ష్యంగా రాష్ట్రం మంత్రి నారా లోకేష్ అమెరికా పర్యటన సాగిందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అమెరికా పర్యటన విజయవంతంగా ముగించుకొని రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రానికి కంపెనీలు, పెట్టుబడులు రాలేదని, వచ్చిన కొంతమంది పారిశ్రామికవేత్తలపైనా బెదిరింపులకు పాల్పడడంతో ఏపీ బ్రాండ్ ఇమేజ్ ఘోరంగా దెబ్బతిందన్నారు. ఈ పరిస్థితుల్లో మంత్రి నారా లోకేష్ వారం రోజులపాటు అమెరికాలో విస్తృతంగా పర్యటించి పెద్దపెద్ద కంపెనీలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సమావేశమై పెట్టుబడులు పెట్టడానికి ఆంధ్రప్రదేశ్ ఎంతో అనుకూలమని వివరించి, వారిలో నమ్మకాన్ని పెంపొందించారన్నారు. ప్రధానంగా మైక్రోసాఫ్ట్, టెస్లా, అమెజాన్, ఎన్ ఇండియా, యాపిల్, సేల్స్ ఫోర్స్, ఫాల్కన్ ఎక్స్, గూగుల్ క్లౌడ్, పెరోల్ గ్రూప్, రేవేచర్, జడ్ స్కాలర్ కంపెనీల సీఈవోలు, ముఖ్య ప్రతినిధులతో మంత్రి సమావేశమై ఏపీలో పెట్టుబడులకు ఆహ్వానించారన్నారు.

లాస్ వేగాస్‌లో 23 దేశాలకు చెందిన 2,300 మంది చిన్న, మధ్య తరగతి పారిశ్రామికవేత్తలు పాల్గొన్న 'ఐటి సర్వ్ సినర్జీ సమిట్'లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ ఎంతో అనుకూలమైందో మంత్రి వివరించడం జరిగిందన్నారు. ఫలితంగా భారీ స్థాయిలో ఏపీకి పెట్టుబడులు వచ్చేందుకు వీలు కలిగిందన్నారు. గడిచిన 5 ఏళ్ల కాలంలో దారితప్పిన పారిశ్రామిక, ఐటీ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు మంత్రి చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వ పాలన సాగుతుందనడానికి ఇదే నిదర్శనమని, ఏపీ అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న ప్రయత్నాలకు ప్రజలంతా వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.